
# అగ్గువ

- చంద్రలత



"అగ్గువ.... అగ్గువ... ఇట్ల రాని... అగ్గువ... అగ్గువ".

"జేబులు ఖాళీ... బుట్టలు ఖాళీ...! అగ్గువంట అగ్గువ!!

అభ్యర్థనలు, నిట్టూర్పుల మధ్య అపూర్వ కూరగాయల మార్కెట్‌లో అడుగు పెట్టింది.

వ్యాపారస్తులు రాసులు పోసిన కూరగాయల మీదుగా - కబుర్లాడుకుంటూ - కొనేవాళ్ళకు బేరాలు ఆడే అవకాశం రానీయకుండా హడావుడి చేస్తూ - తెమిల్చి పంపుతున్నారు.

అపూర్వ అలవాటు ప్రకారం పాండు దుకాణం దగ్గరకు వెళ్ళి నిల్చుంది.

పాండు తనకు కుడివైపున ఉన్న మూడో వ్యాపారితోనూ... ఎడం వైపున ఉన్న రెండో వ్యాపారితోనూ... ఏక వేళలో ఏకబిగిన... చర్చల్లో మునిగి ఉన్నాడు.

అపూర్వ ఉనికిని గుర్తించినట్లుగా ఓ నీలం రంగు ప్లాస్టిక్ బుట్టను ఆమె వైపు నెట్టాడు. అదే చేత్తో మరొరకరు అందించిన బుట్టను అందుకున్నాడు. చెవులను తన తోటి వ్యాపారులకు అప్పజెప్పి - తూచిన కూరగాయలను ఆవిడ ఎత్తి పట్టుకున్న బుట్టలో గుమ్మరించాడు.

"పావు కేజీ బెండకాయ, కేజీ టమాట, అర కేజీ వంకాయ - ఇరవై రూపాయలు" పాండు గబగబ అన్నాడు. అదే వేగంతో ఆమె అందించిన డబ్బును గల్లా పెట్టిలోకి నెట్టేశాడు.

అపూర్వ వైపు తిరిగి ఆమె చేతిలోని బుట్ట అందివ్వమన్నట్టుగా తల ఎగరేశాడు. అపూర్వ ఉలిక్కిపడింది. "ఏదీ ఇంకా కుప్పలోంచి కూరగాయలు ఏరనే లేదు".

"తొందరక్కానీయమ్మా..." పాండు తలాడించాడు. అపూర్వను ఓ కంట కనిపెడుతూ తన మిత్రుల చర్చలో మాట కలిపాడు.

అపూర్వ వాళ్ళవైపో చెవి ఒగ్గి కూరగాయలవైపు దృష్టి పెట్టింది.

"నువ్వెన్నన్నా చెప్పన్నా... ఇది ఒక్క రోజులో తేలేది కాదు. అరే - ఏమను కుంటున్నార్రా వాళ్ళు? ఒక్కొడొస్తడు - 'మీకేం కాదు. మాట్లాడకుండ ఉండండి. ఎవ్వరొస్తరో

చూస్తమంటాడు. మరొకడొస్తడు – 'అరే ఎందుకొచ్చిన తిప్పల్రా ఎంతో కొంత కట్టేయమంటాడు. అబ్బ... విసుగొస్తోందన్నా" పాండు తోటి వ్యాపారి కంఠంలో నిస్సత్తువ, నిస్సహాయత.

పాండు మాట పలుకులో అంతకన్నా నిర్లిప్తత.

కళకళలాడుతోన్న మార్కెట్‌లో వెలవెలబోతున్న మాటలు.

అపూర్వ నిశ్శబ్దంగా వారి సంభాషణను వినసాగింది అనుకోకుండానే.

"మనం దబ్బులు కట్టక తప్పేది లేదు. కట్టకుంటే ఎట్టబోతాం? అసలు కలెక్టర్ ఆర్డర్లు. ఎంతో కొంతకు సావధానం జేసుకొంటే మేలు!"

"పిచ్చోడిలా మాట్లాడుతున్నావే... ఎంతెంత కట్టాల్నో తెలుసా? అంతా కూడితే లక్షల్లో... లక్షల్లో... ఉంటుంది! ఎక్కడ తేవాల? ఎవ్వడు తేవాల?".

"అదీ మన తట్టలు తరాజులు తాకట్టు పెట్టకొని!"

అందరూ పగలబడి నవ్వారు. నవ్వాలో ఏడవాలో తేలక నవ్వేసినట్టు!

"పాండూ.... టమాటలు ఎలా ఇస్తన్నావ్?" పాండుని చర్చలోంచి బేరసారాల్లోకి లాక్కొచ్చింది అపూర్వ.

"పది రూపాయలకు మూడు కిలోలు".

"అదేంటీ...? ఇవ్వాళ్ళ పేపర్లలో రైతులు ఇరవై పైసలకో నలభై పైసలకో అమ్ముకోవాల్సి వచ్చిందని రాశారే-?"

"అయితే... అక్కణ్ణే పోయి కొనుక్కోమ్మా..." పాండు టపీమని సమాధానం చెప్పి – పక్కన తూకానికి వచ్చిన బుట్టను అందుకొని... వారితో బేరానికి దిగాడు.

అపూర్వ రాసులు పోసిన కూరగాయల వంక చూసింది.

టమాటాలు, వంకాయలు, పందిరి చిక్కుళ్ళు, గోరు చిక్కుళ్ళు, కాకర, బీర, సొర, బెండ, దొండ చక్కగా అల్లిన వెదురుబుట్టలపై మిఠాయిలు పేర్చినట్టు పేర్చి వున్నాయి. ఒక్కో కాయగూరనూ శ్రద్ధగా నూనెతో మెరుగు పెట్టినట్లుగా – ఆ ఉదయపు నీరెండలో మిలమిలా మెరుస్తూ – నోరూరిస్తున్నాయి.

కూరగాయల్లో మహారాణిలా ఎత్తైన రాశి మీద ఠీవిగా కొలువై ఉంది ముద్దులొలికే ఎఱ్ఱటి టమాట.

"నాలుగు రోజులు పోతే పది రూపాయలకు కిలో... వారం పోతే పన్నెండు.పెరిగే ధరే కానీ తరిగేది కాదు. తీసుకోండమ్మా... పచ్చడి చెయ్యొచ్చు. రసం తీయొచ్చు.." పాండు ఊరించినట్లుగా చెప్తున్నాడు. "ఇది సరైన టైం. మళ్ళీ దొరకదు. ఇంత చౌకగా".

అవును. తమ్ముడు కూడా ఇదే అన్నాడు. తన చేతిలో ప్రాజెక్ట్ రిపోర్ట్ పెట్టి.

"అక్కా... ఇది సరైన టైం. టమాట గుజ్జును నిలువచేసి, సూప్, కెచప్, జ్యూస్, సాస్, పికల్... ఎన్నో రకాలుగా ఎక్స్‌పోర్ట్ చేయొచ్చు.... ఇంత చౌకగా మళ్ళీ దొరకదు".

తమ్ముడు అమిత్‌కు దొరికిన చౌక బేరం టమాటే కాదు. టమాటల బై ప్రొడక్ట్సను తయారుచేస్తూ కొంతకాలంగా మూతబడిన యూనిట్.

వాడికి బోలెడు సందేహాలు.

టమాటాలను కాయలుగా నిలువచేసి ఎగుమతి చేస్తే ఎక్కువ లాభమా? గుజ్జు తీసి ఎగుమతి చేస్తే ఎక్కువ లాభమా? తీసిన గుజ్జును వినియోగ పదార్థాలుగా తయారుచేసి ఎగుమతి చేస్తే ఎక్కువ లాభమా? మూడు పద్ధతులలో విడివిడిగా ఎగుమతి చేస్తే ఎక్కువ లాభమా? ఒకేసారి ఎగుమతి చేస్తే ఎక్కువ లాభమా?

అసలు పెట్టుబడికి తగ్గరాబడి ఉంటుందా? శ్రమకి తగ్గ ఫలితం వస్తే లాభం లేదు. శ్రమకి మించిన ఫలితం రావాలి. అందుకు ఏమిటీ మార్గం?

ఈ తరహా ప్రశ్నల పరంపరలో అపూర్వను ముంచితేల్చాడు అమిత్.

అమిత్‌కి భరోసా అయితే ఇచ్చింది కానీ తనింకా ఒక నిశ్చితాభిప్రాయానికి రాలేదు.

ఏం చెప్పాలి?

తమ్ముడు తన వాడయినా ధర్మం చెప్పాలి!

ధర్మం!!

కానీ, వాడికి కావల్సింది. లాభం!

లాభమే!!

అమిత్‌కే కాదు. అందరికి కావల్సిందీ లాభమే.

ప్చ్!

లాభం లేదు!!

అమిత్ కొనాలనుకొంటోన్న యూనిట్‌ను మూసివేసిందే – లాభం లేదనేగా?

కళకళలాడుతోన్న తమ గ్రామీణ బ్యాంక్‌ను మూసి వేయాలనుకొంటోందీ – లాభం లేదనేగా?

"అయ్యో-"

"లాభం లేదమ్మా..." పాండు అపూర్వ ముఖకవళికల్లో హావభావాల్లో మార్పులు గమనించి అన్నాడు, "ఇదేమీ అగ్గువ యాపారం కాదమ్మా... అగ్గిమీద గుగ్గిలం! పచ్చి సరుకు... తల్లీ... పచ్చిసరుకు! దీంట్లో మిగుల్చుకోని మిద్దెలు కట్టబోయేదే ముందమ్మా -- ఏదో కడుపాతురమే కానీ. ఈ పచ్చిసరుకుతో మా తిప్పలు తిప్పలు కావు తల్లీ...!

వదలి పోయినంత వదలిపోతే – కుళ్ళి పోయినంత కుళ్ళిపోతే – పారబోసు కోవాల్సిందే కదమ్మా.... మీరంటే కొని ఫ్రిజ్‌లో పెట్టుకుంటారు. మేము...? ఎండకు ఎండి... వానల తడిసి... దుమ్ముధూళిల పడి... మా తిప్పలు తిప్పలు కావమ్మా..."

అపూర్వ పాండు ముఖంలోకి చూస్తూ ఉండి పోయింది. నిజం. ఆమె ఎదురుగా ఆమె చుట్టూ.

"సరుకు తేవడానికి అప్పు చేస్తాం. అప్పు తీర్చడానికి మళ్ళీ సరుకు కొంటాం. అప్పు మీద అప్పు... అంతే" పాండు మళ్ళీ అన్నాడు.

పాండు మాటకారితనం కన్నా అతని మాటల్లో సత్యం అపూర్వ నోరు మెదపనీయ లేదు. అయినా మార్కెట్‌లో ఎవరి వద్దకు వెళ్ళినా ఒకే రేటు. అందరూ కూడ బలుక్కున్నట్లు. అపూర్వ బేరాలు కట్టి పెట్టింది. టమాటాలు తీసుకొని మార్కెట్ బయట పడింది.

"అమ్మా.... అమిత్‌సార్ మిమ్మల్ని తొందరగా రమ్మంటున్నారు." డ్రైవర్ రాజు ఎదురు వచ్చి హడావుడిగా అన్నాడు.

అపూర్వ చేతిలో కూరగాయలు అందుకోబోతున్న రాజు చేతిలో టమాటా కవరు.

"రాజూ... ఎలా కొన్నావ్?" యధాలాపంగా ఆరా తీసింది.

"రూపాయిన్నర".

"అంత తక్కువా?" అపూర్వ గతుక్కుమంది. తనను మాటల్లో పెట్టి పాండు ఎంత పని చేశాడు!

"బయట బుట్టల వాళ్ల దగ్గర కొన్నానమ్మా... పల్లెల నుంచి తెచ్చి అమ్ముతారు కదా... అగ్గువ".

అపూర్వ మళ్ళీ మార్కెట్ వైపు ఆరాగా చూసింది. మార్కెట్ గేట్‌కి ఇరువైపులా కాంపౌండ్ వాల్‌ను ఆనుకొని వరుసగా కూర్చుని ఉన్నారు. తలా ఓ బుట్ట ముందు పెట్టుకొని, అక్కడ ఏదో ఘర్షణ జరుగుతోంది.

"ఏంటి రాజూ... అక్కడ ఏదో గొడవ.."

"మార్కెట్ లోపల వాళ్ళు బయట బుట్టల వాళ్ళు తగవులాడుకొంటున్నారమ్మా... అంత అగ్గువకు అమ్ముతున్నారని. లోపలి వాళ్ళేమంటున్నారంటే-- "మార్కెట్ అద్దెలు కట్టాలె... ట్యాక్సులు కట్టాలే... ధర తక్కువ చేస్తే మేమెట్ల బతకాలె... తెచ్చిన సరకు మాకే అమ్మి ఊళ్ళకు బోండి" అంటున్నారు. బయటి వాళ్ళు 'వచ్చేది పావలో అర్ధో మాకే రానీ మీకెందుకు అగ్గువకు అమ్మాలె' అంటూ తిరగబడ్డారు. "మేం మాత్రం... మామూళ్ళు ఇచ్చింది కాక పండో ఫలమో చేత బెట్టి బిక్కుబిక్కుమంటూ...ఏ బస్సు కింద పడతామో ఏ లారీ కింద పడతామో లెక్క పెట్టకుండా ... యాపారం చేస్తలేమా? అయినా మీకేం తెలుసు... ఇది మా తోటల పంట... పసి పిల్లను సాకినట్లు సాకిన పంట..." అని వీరి వాదన...వేదన..!.

"అయ్యో...."

"మీరు పదండమ్మా... ఇది ఇక్కడ రోజూ ఉండేదే... మిమ్మల్నిసార్ త్వరగా రమ్మంటున్నారు".

అపూర్వ అన్యమనస్కంగా ఇంట్లో అడుగు పెట్టేసరికి అక్కడా టమాటాలు! గంప నిండా!

"మదనపల్లెలో పెట్రోలు పోయించుకుందామని ఆగానా... వాళ్ళు పెట్రోల్ బిల్‌తో పాటు లీటర్‌కు కిలో టమాటాలు ఉచితంగా డిక్కీలో పడేసారు. పాతిక కేజీలు!" అమిత్ భుజాలెగరేసాడు.

పావలాకో అర్ధకో టమాటాలు అమ్ముకోలేక పంటను రోడ్లపాలు చేస్తున్న దుస్థితి అక్కడ.

అపూర్వ గాఢంగా నిట్టూర్చి చుట్టూ చూసింది.

టమాటాలు.

ఇంటి నిండా టమాటాలు.

బుట్టల్లో, కవర్లల్లో, ఫ్రిజ్‌లో.

ఎక్కడ చూసినా టమాటాలు.

ఎఱ్ఱగా... బుజ్జిగా... నున్నగా మిలమిలాడుతూ.

టమాటాలు.

"రాజూ... నువ్వు, మన పోశమ్మ... తలా కాసిని పట్టుకు పోండి. మన పక్కింటి వాళ్ళకు వెనకింటి వాళ్ళకు తలాకొన్ని ఇచ్చేసిరా...."

రాజు, పోశమ్మ హుషారుగా ఆ పనిలో పడ్డారు.

చక్కగా పండిన ఎఱ్ఱటి టమాటాలను తీసి కడుగుతూ – తమ్ముడి వంక చూసింది అపూర్వ.

"అక్కా.." అమిత్ నసిగాడు.

అమిత్ వచ్చిన పనేమిటో అపూర్వ మర్చిపోలేదు.

"అమిత్... ముందు నువ్వు ఫ్రెషప్ అయ్యిరా..."

అమిత్ బుద్ధిగా తలాడించి గదిలోకి వెళ్ళాడు.

అపూర్వ ఉడికిన టమాటాను గుజ్జు తీసింది. కార్న్‌ఫ్లోర్‌ను నెయ్యితో సన్నని సెగ మీద వేపింది. టమాటా గుజ్జుతో కలియబెడుతూంటే – కమ్మని వాసన

ఇంటిని చుట్టేసింది. వడగట్టడంలో తప్పిపోయిన టమాటా గింజలు సూప్‌లో తేలియాడు తున్నాయి.

అపూర్వ స్పూన్‌తో వాటిని కదిలిస్తూ ఆలోచనల్లో పడిపోయింది.

పెదనాన్న కూడా ఇలాగే చేసేవాడు. పెద్దపెద్ద గంగాళాల్లో టమాటాలు వేసి, మెత్తగా నలిపి - గుజ్జు తీసి - పెద్దపెద్ద ఇనుప జల్లెళ్ళపై పోసే వారు. గుజ్జు, రసం పోగా తొక్క, గింజలు మిగిలేవి. మళ్ళీ వాటిని వేరే చేసే వారు.

ఆరబోసి ఎండబెట్టిన గింజలు మళ్ళీ నాట్లకు విత్తనాలు.

దుక్కులు దున్ని - నారుమడి పోసి - ఈతాకు మండలు కప్పేవాడు.

విత్తనాలు మొలకెత్తేదాకా కళ్ళల్లో వత్తులు వేసుకుని కూర్చునే వాడు.

టమాటా వేసవి పంట. అదును కుదిరితే అదనపు పంట. కుదరక పోతే అసలు పంటే!

టమాటా నారు పోయడానికి రెండు వారాల ముందే బంతినారు పోసే వాడు.

"ఎర పంట. టమాటా మొక్కలకు వారగా బంతి నాటేస్తే - పురుగు పుట్ర టమాటాలను ఆశించకుండా బంతిపూల వైపు మళ్ళుతాయి!"

కానీ, టమాటానే ఎర పంట అయి కూర్చుంది. పెదనాన్న జీవితానికే ఎర వేసింది. ఫ్చ్!

నల్లటి నేల మీద చుక్కలు మెరిసినట్లుగా మొలకలు మొలవగానే పసి పిల్లవాడి లాగా పెదనాన్న ముఖం వెలిగిపోయేది. చిగుర్లు కనిపించేలా పకపక నవ్వుతూ తమ చేతులు పట్టుకొని నారుమడుల చుట్టూ తిరిగేవాడు.

మొలకింతై ఆకంతై చిన్నిమొక్క నిగడదన్ని నిలబడితే తను పగలబడి నవ్వుకొనే వాడు. చిన్నిమొక్క చకచక ఎదిగి, నూగుపట్టిన కొమ్మల రెమ్మల మాటున నక్షత్రాల వంటి మొగ్గ తొడిగితే - చక్కిలిగింతలు పెట్టినట్లు నవ్వేవాడు.

మొగ్గ పువ్వై - పువ్వు పిందె తొడిగిన రోజున పెదనాన్న సంబరం ఎంతని!

పెదనాన్న ముఖం చూస్తే చాలు. కడుపు నిండి పోయేది.

పసిపాపలా ఎదుగుతోన్న తన పంట.

పదిలంగా పొదువుకుంటోన్న తన పంచ ప్రాణాలు.

హాయిగా. ఆనందంగా.

చూస్తుండగానే పిందె కాయలై, కాయలు కోతకు సిద్ధమైతే - ఆడపిల్లను అత్త వారింటికి అంపకాలు పెట్టవలసిన తండ్రిలా తాతయ్య గుండెలవిసి పోయేవి కావూ?

అతని పంట.

అతని ఊపిరి.

అతని జీవితం.

అంతేనా?

అతని ఉత్పత్తి.

అతని ఉపాధి.

అతని జీవనం.

అంగడిలో పెట్టాల్సిన రోజున-

ఎవరికి అతని ఉచ్ఛ్వాస నిశ్వాసాల ధ్వని వినబడుతుంది?

ఎవరికి అతడి కంటి పొర మీది తడి కనబడుతుంది?

గంపలోని కాయల నేవళం. నాణ్యత తప్పు!

వ్యాపారులు ఒక్కో గంపలోకి చేయిపెట్టి కాయలను వత్తి వత్తి చూస్తుంటే తన గుండెను చిదిమినట్లు విలవిలలాడి పోయే వాడు కాదూ?

"ప్చ్... లాభం లేదు. ఒట్టి బోలు.. కండ లేదు" అంటూ బయ్యరు పెదవి విరిస్తే తన వెన్ను విరిచినట్లు విరుచుకుపడి పోయే వాడు కాదూ?

పండు చిదిమి నోట్లో రసం పిండుకొని, "అబ్బే... పులుపు లేదు" అంటూ వ్యాపారి తుపుక్కున ఉమ్మేస్తే - తన గుండె చిదిమినట్లుగా గిజగిజలాడే వాడు కాదూ?

కన్న బిడ్డను చూపిస్తూ కన్నొంకర కాలొంకర అని వంకలు పెడుతోంటె కన్న కడుపు రగిలినట్లుగా లోలోన కుమిలిపోయే వాడు కాదూ?

"పది మణుగులు పాతికంటే ఎక్కువే!"

"వంద కిలోలు పాతిక రూపాయలంటే... కిలో పావలానా?"

"ఆ బాధలో... ఆ రోషంలో.... ఆ పౌరుషంలో... ఆ ఆర్తిలో...

పేగుల గోడల్ని తన్నుకుంటూ మాటలు పెల్లుబికి వచ్చేవి కావూ?

"ఏందయ్యో బయ్యరు... నాలుక్కి నరాలున్న మాటలేనా అయ్యి? కిలో పావలానా? మళ్ళీ ఊళ్ళోకి బేరానికి వద్దామనే...!" పెదనాన్న ముల్లుగర్రకు పిడికిలి బిగించి హూంకరించేవాడు.

"నేనింకా పావలా అన్నా ఇస్తానన్నా... మార్కెట్టుకు బో... ఇంత అదవ చిక్కిన సరుక్కి పదిపైసలు రాలితే - అప్పుడు చెప్పు తీసుకు కొట్టు" - బయ్యరు పెదనాన్న ఉగ్రరూపాన్ని భరించలేనట్టుగా ఓ అడుగు వెనక్కువేసి.

"ఏంట్రా... ప్రతేడు ఇదే తంతు. వొళ్ళు హూనం చేసుకొని పాణంలా పెంచుకున్న పంటని పదికీ పరక్కీ నీచేత పారబోయడమే - నువ్వేమో సైకిలు పోయి పెద్దబండి కొంటివి. నేనేమో పోయినేడు ఎకరం అమ్మకానికి పెడితిని".

"దానికి నేనేం చేయాలో..." దీర్ఘం తీశాడు బయ్యరు భద్రయ్య.

"నువ్వెందుకు చేత్తా... నేనే చేత్తా చెయ్యాలనుకొన్నది. ముందు పొలం గట్టు దిగు-" గుడ్లురిమి గర్జించాడు, "ఏంట్రా... నేనేమన్నా బిచ్చగాణ్ణనుకొన్నావా? రైతునురా... చెమటోడ్చి పండించిన పంటరా అదీ... నీకెట్టా అర్థమవుతుందిరా... పో... వెనక్కి తిరిగి చూడకుండా పోరా".

"నువ్వెక్కడికి పోతావో... నేనూ చూస్తా" బయ్యరు అదే విసురులో పోయాడు.

పెదనాన్న గట్టు మీద కుప్పకూలి పోయేవాడు.

"అమ్మా... చూడు.. బంగారం లాంటి పంట. మణులు మెరిసినట్లు ధగధగలాడి పోతోన్న కాయలు... మట్టి కొట్టమంటావేమ్మా..." ఆ మాటల్లో వేదన తనకు అప్పుడు అర్థం కాక పోయినా ఇప్పటికీ గుండెల్ని పిండేస్తుంది. ఆ దుఃఖం, నిస్సహాయత, నిస్పృహ. ఫ్చ్!

"ఒరేయ్... భద్రం! మళ్ళీ ఇటు అడుగు పెట్టావో జాగ్రత్త!" నవనాడులు కుంగి పోతున్నా బోలు గొంతుతో అరిచేవాడు పెదనాన్న. బిరబిరా పొలాలకు అడ్డం పడి పోతోన్న బయ్యరు భద్రం వంక చూస్తూ.

గాలివాటున పెదనాన్న మాటలు భద్రం చెవిన పడేవో లేదో కానీ - అతనూ గీరగా బదులు ఇచ్చేవాడు. ఆ జవాబు గాలివాటునే వచ్చి చేరేది.

"ఆ... ఆ... ఇప్పుడట్టాగే అను. మాపటికి నువ్వే నన్ను ఎతుక్కుంటూ వత్తావు!"

"ఆర్నీ...! చూడరా భద్రం... నేనే సరుకు తీసికెళ్ళి ఎట్టా అమ్ముకొత్తానో.... బంగారం లాంటి టమాటాలు..."

"ఆ... ఎళ్ళెళ్ళు! ఆ బులపాటం కూడా తీరనీ!"

నల్లటి రేగడి మీద పచ్చటి మొక్కల నిండా ఎర్రటి టమాటాలు. ఎక్కడ చూసినా.

చిత్రకారుడు మేళవించి అద్దిన అందమైన రంగుల చిత్రంలా పొలం.

పెదనాన్న మళ్ళీ పుంజుకొని సాటి రైతులను తలో కేక వేసేవాడు.

దోర మగ్గిన కాయలతో గంపలు నిండేవి. గోతాం ముక్కలతో గంపను కుట్టేస్తుంటే పెదనాన్న బిగించిన దవడ మరింత బిగుసుకొనేది. సుశిక్షితమైన సైనికుడిలా తన పని తను చేసుకొనే వాడు.

మార్కెట్టుకు పెదనాన్న వెంట నేను వెళ్తానంటే నేను వెళ్తానని అమిత్ తనూ పోటీ పడే వారు. తెల్లవారుఝామున చెరువు గట్టు భూషయ్య గారి ట్రాక్టరులో గంపలు ఎక్కించే వారు.

చివరికి ఆ రోజు!

పొద్దు చుక్క పొడవక ముందే మార్కెట్టుకు ప్రయాణమయ్యారు.

ముసిముసి చీకట్లు విచ్చుకోక ముందే ట్రాక్టరు చౌరస్తా దాటి చెక్‌పోస్టు దగ్గరికి వచ్చింది.

రైరో!

ఆగిపోయింది. టమాటాల ట్రాక్టరు. రైతుల గుండె.

అటూ ఇటూ లారీలు, ట్రాక్టర్లు.

పంటలతో నిండి వున్నాయి.

సీ బుక్కుందా? లైసెన్స్ ఏది? ట్రాక్టర్ స్వంతమా? బాడుగా? పంట ఎందాకా? ప్రక్క జిల్లాకా? ప్రక్క రాష్ట్రానికా? పర్మిట్ ఉందా? వేబిల్ ఏది? టాక్స్ కట్టావా?

ప్రశ్నల మీద ప్రశ్నలు.

గంపలను లాఠీలతో గుచ్చిగుచ్చి.

గంటల మీద గంటలు.

గుండెలలో గునపాలను దించింది.

గుంటలు పూటలై... పూటలు రోజులైనా...

ప్రశ్నల మీద ప్రశ్నలు.

"అయ్యా... మాకయన్నీ తెలియదు. మా బయ్యరు చూసుకొనే వాడు. పచ్చి సరుకయ్యా... కావాలంటే గంపలలో చూడండయ్యా." బిక్కచచ్చిన పెదనాన్న గొంతు బొంగురుపోయింది.

"ఎల్లెల్లు! చూపిచ్చావులే... బోడి సరుకు! ఈ రోజుల్లో ఇంకేం వన్తయ్యి? ఏవీ తెలియదు. వల్లెటూరి గబ్బిలాయిలు. మా ప్రాణాలకు తగలడతారు. కొంపాగోడు అనుకోకుండా రోడ్డున బడి చత్తంటే..." అతను గొణుక్కున్నాడు" పైసా రాల్చరు. పైన బడి ఏడుస్తారు. ఛీ... ఛీ..."

అతని ముఖంలోని ఛీత్కారానికి పెదనాన్న గుండె చివుక్కుమంది. రోషం బుస కొట్టింది.

"ఏంటయ్యా.... అట్టా అంటన్నా? నేనేమన్నా

దొంగతనం చేసానా? దొమ్మీ చేసానా? చెమటోడ్చి పండించిన నా పంటను నేను అమ్ముకోనుచ్చి పెద్ద సంతకు బోతున్నా.. అయ్యా... పోలీసాయనా... నేను దొంగను కాను రైతును! తెలిసిందా... హు!"

"ఏంటీ తిరగబడతన్నా... కొడతావా? ఆ కాగితాలన్నీ తెచ్చి చూపిస్తేనే నీ బండి కదలనిచ్చేది. నీ దిక్కున్న కాడ చెప్పుకో పో!" పోలీసు పళ్ళు పటపటలాడించాడు.

"ఇదిగో.. సారూ... అతనికి కొత్తలా ఉంది. కాస్త చూసీ చూడనట్టు పోరాదయ్యా.." ఎవరో కలగజేసుకొని అన్నారు.

"మట్టి పిసుక్కునే వాడు అతనికే అంత రోషమైతే యూనిఫాం తొడిగిన నాకెంత రోషముండాల?" అతను గీరగా అంటూ చరాచరా వెళ్ళిపోయాడు.

"నీ ఆవేశం వల్లే అంతా జరిగింది" తోటి రైతుల నూటిపోటి మాటలు పెదనాన్నను మరింత కుళ్ళబొడిచాయి.

"ఒరేయ్ చదువు సంధ్య లేనివాణ్ణి. ఆ కాగితాలు రాతలు కోతలు నాకేం తెలుసురా? ఈ డబ్బు కట్టు అంటే కట్టనా? మీరంతా చూత్తానే ఉన్నారు కదరా? నా తప్పేంటి? నా పాణం పోసి పెంచిన పంటరా. పెళ్ళాం పుస్తెలు తాకట్టు పెట్టి పండించిన పంటరా. నాలుగు రూకలొస్తే కాస్త తెరిపిన పడొచ్చు అనుకున్నానే కానీ, "పెదనాన్న గుండె చిక్కబట్టింది, నేను దొంగనా? నేను బిచ్చగాణ్ణా? చెప్పండ్రా".

"అయ్యన్నీ ఇప్పుడెందుగ్గానీ... నాలుగు డబ్బులు అతని ఎదాన పడెయ్యి. అన్నీ కుదురుకుంటయ్యి!"

"సరే, మీ మాటే నామాట"

మాటలు తెగట్లేదు. బేరం కుదరట్లేదు. పంతం పెరుగుతోంది. వట్టు బిగుస్తోంది. రోజులు దొర్లుతున్నాయి. గంపల్లో పంట గంపల్లో మగ్గిపోతోంది. రైతుల గుండెలు పగిలి పోతున్నాయి. బాడుగలు పెరిగి పోతున్నాయి. ఆ వరుసలో కొత్త బండ్లు వచ్చి చేరుతున్నాయి.

చూసీ చూసీ... ఇక చూడలేక.. అందరూ ఏకమై రోడ్డు కడ్డం నిలబడ్డారు.

**అంతే!**

ఎదురు తిరిగిన రైతాంగం!

మొక్కవోని లాఠీల వీరంగం!

రోడ్డుకెక్కిన తతంగం!

చావకొట్టించుకొని కన్ను లొట్టబోయి - మార్కెట్టు చేరి గంపలు దించేసరికి - ఏముందీ?

సర్వనాశనం.

దోర మగ్గిన పండు. మాగి.... చితికి... కుళ్ళి.... గంపలనిండా... పారబోసుకోను తప్ప... మిగిలిందేమిటి?

"పచ్చి సరుకయ్యా.... పచ్చి సరుకు..." పెదనాన్న నేలమీద పడి గుండె బద్దలయ్యేట్టు వెక్కి వెక్కి ఏడ్చాడు. తొలిసూరి బిడ్డ పురిట్లో పోయినట్లుగా.

అపూర్వ కళ్ళల్లో నీళ్ళు జలజల రాలాయి.

అలా గుండె ముక్కలయిన పెదనాన్న ఇక తేరుకోలేదు. మళ్ళీ పంటల కాలం నాటికి.... మంచంలో పడిన మనిషి మంచంలోనే... ప్ఫ్!

అపూర్వ చిక్కబడిన సూప్‌లో గరిటను అప్రయత్నంగా తిప్పుతూనే ఉంది.

"అందుకే అక్కా.... నీతో మాట్లాడడానికి నేను భయపడేది. టమాటా మాట ఎత్తితే ఎమోషనల్ అవుతావు" అమిత్ పక్కగా వచ్చి స్టవ్ ఆపేసాడు.

అపూర్వ గబగబ కళ్ళు తుడుచుకుంది. గరిటను వదిలేసి టేబుల్ దగ్గరకు వెళ్ళి కూర్చుంది. ముఖాన్ని అరచేతుల్లోకి వాల్చి దుఃఖాన్ని వంపుకుంది.

అమిత్ ఆమె దుఃఖంలో పాలు పంచుకున్నట్లు మౌనం వహించాడు. నిశ్శబ్దంగా సూప్ బౌల్‌లోకి సూప్‌ను నింపాడు. ట్రేలో సర్ది టేబుల్ మీద పెట్టాడు.

'టమాట... ఎరపంట... పచ్చి సరుకు... ప్ఫ్... పెదనాన్న..." అపూర్వ గొంతులో దుఃఖం ఉంగలు చుట్టుకుంటోంది.

"అక్కా..." అమిత్ పిలుపులోని తడి అపూర్వను తాకింది. అపూర్వ తేరుకుంది. వాష్ బేసిన్ వద్దకు వెళ్లి ముఖాన నీళ్ల చల్లుకుంది. ముఖాన తడి తుడుచుకొంటూ - మాటలు వినబడుతోంటే కిటికీ లోంచి బయటకు చూసింది.

పోశవ్వ, రాజు పోటీలు పడుతూ టమాటా ముక్కలను ఎండ బెడుతున్నారు. ఉప్పు పసుపు రాసి ఎండబెడుతోన్న ఆ టమాట ముక్కలను ఎన్ని రకాలుగా వాడు కోవచ్చో పోశవ్వ వివరిస్తోంది. రాజు శ్రద్ధగా వింటూ.. మరిన్ని వివరాలడుగుతూ... పోశవ్వకు హుషారు కలిగిస్తున్నాడు.

"అవును... ఇది ఏ ఇంటి ఇల్లాలికయినా తెలిసిన మర్మం. ఎక్కువగా దొరికే కాలంలో కూరగాయలను పచ్చడిగానో వరుగుగానో వడియం గానో దాచి - దొరకని రోజున వాడుకోవడం. అమిత్ అదే చేస్తానంటున్నాడు. అంతే! అంతేనా?'

"అక్కా..." అమిత్ నెమ్మదిగా అన్నాడు. "నాకు మాత్రం ఆ బాధ లేదా అక్కా.... మన ఊళ్ళో పంట విరగపండే సరికి మార్కెట్లలోకి అటు కోయంబత్తూరు నుంచి ఇటు బెంగుళూరు నుంచి టమాట వచ్చి పడుతోంది. పంటకు పెట్టిన పెట్టుబడే తడిపి మోపడవుతోంటే- పండిన పంటను పొలం నుంచి మార్కెట్టుకు తీసికెళ్ళడానికి రవాణా ఖర్చులు అదిరి పోతున్నాయి. తీరా అక్కడికి వెళ్ళితే రవాణాకే గిట్టుబాటు కాదు. ఇక పెట్టుబడి ఎక్కడ తిరిగి వస్తుంది? ఇక లాభం అంటే ఏంటో మనవాళ్ళు ఎరుగుదురా? ప్రతి ఏడాదీ మన పంటంతా రోడ్ల పాలే కదా? కుళ్ళ బెట్టి పారబోయడం కన్నా... పంటను భద్రం చేస్తే మంచిదే కదా?"

అపూర్వ మౌనంగా అమిత్ చెప్పేది వింటోంది.

"అన్నిటికన్నా ముఖ్యం. మార్కెట్ స్థిరత్వం వస్తుంది. రైతులు గంపలెత్తుకొని తిన్నగా వచ్చి ఫ్యాక్టరీ దగ్గర సరుకు అమ్ముకోవచ్చు. ఉన్న ఊళ్ళో, లారీ బాడుగలు లేవు. మార్కెట్ సెస్సులు లేవు. కళ్ళకెదురుగా ఫ్యాక్టరీ. కాంట్రాక్టు కుదుర్చుకొంటే మార్కెట్ భద్రత అన్నది ఏర్పడుతుంది కదా-" అమిత్ ఉద్వేగంగా చెపుతున్నాడు, "దాంతో పాటు కోల్డ్ స్టోరేజ్ కూడా ప్లాన్ చేస్తున్నాం - కాబట్టి రైతుల పంట కొంత కాలం నిలువ చేసుకోవచ్చు-".

అపూర్వ టేబుల్ దగ్గరకు వచ్చి కూర్చుంది. అమిత్ టమాట సూప్ అందించాడు.

"సరే, మరి పెట్టుబడి?"

"అక్కా.. నువ్వే అలా అంటే ఎలా? ఇవ్వాళ బ్యాంకులు మాలాంటి వారికి కార్లు కొంటానికి, ఇళ్ళు కొంటానికి - వెంటబడి మరీ అప్పులిస్తోంటే...'

"నిజమే, కానీ మూతబడిన ఓ ఫ్యాక్టరీ కొనడానికి ఇస్తారంటావా?"

"నేను మేనేజ్ చేస్తాగా?" అమిత్ ధీమాగా అన్నాడు. "అయినా అది చాలా అగ్గువగా వస్తోంది" అమిత్‌లో ఉత్సాహం ఇనుమడించింది.

చిన్నచిన్న వేయించిన బ్రెడ్ ముక్కలను అపూర్వకు అందించాడు.

చిన్నప్పటి నుంచి వాడు అంతే. బ్రెడ్ లేకుండా సూప్ తాగడు.

లాభం లేకుండా ఏ ఆలోచనా చేయడు. తన లాభం తను చూసుకొనే ఉంటాడు.

అపూర్వ మౌనంలోకి కూరుకుపోయింది. ఈ మధ్య తరచూ వినబడుతోన్నది ఇదే. లాభం! లాభం లేదు. బ్రాంచి మూతబడాల్సిందే. కాకపోతే మనం ఎంత త్వరగా ఎన్నింటిని మూసి వేయవచ్చో, ఎన్నింటిని సమీప పట్టణ బ్రాంచీలలో విలీనం చేయవచ్చో.... రిపోర్టులు తయారు చేసుకోవాలి. గ్రామీణ బ్రాంచీలన్నీ నష్టాలే. లాభం అన్న మాటే లేదు. అదే పట్టణ బ్రాంచీలు చూడండి. నగరాల్లో చూడండి. రికవరీలు. ఎంత లాభం! అదీ ముఖ్యం. "బ్రాంచి ఇన్‌చార్జి అన్నాడు" హెడ్ ఆఫీసు నుంచి తొందర. వత్తిడి. వెంటనే రిపోర్టులు తయారవ్వాలి!"

రిపోర్టులు.

లాభం లేదు.

అంతే. అదే కావాలి. లాభం లేదు. అన్న రిపోర్టు.

ప్ఫ్!

"సార్, మన రుణాల పైన పెట్టుబడి ఎంతమంది బడుగు జీవులు, బలహీన వర్గాల ఉపాధి ఆధారపడి వుందో కదా..."

"కానీ, చాలా గ్రామీణ బ్యాంకులలో బడుతు రైతుల వాటా వంద నుంచి పది శాతానికి తగ్గించేశాయి. సుమారు రెండొందలు గ్రామీణ బ్యాంకులలో నూట అరవకి పైగా నష్టాలతో మూత పడ్డాయి. సహకార బ్యాంకుల వ్యవసాయ రుణాల వాటా గణనీయంగా తగ్గిపోతోంది. యాభై శాతం పైగా. వడ్డీ రేట్లు. పీనల్ ఇంట్రస్ట్‌లు. ఇతర ఖర్చులు కలిపి వసూలు చేసినా - బ్యాంకుకు లాభం లేదు. అదే నగరాలలో పట్టణాలలో అయితేనా...? ఒక్క ఏడాదిలో ఎనభై వేల కోట్ల రూపాయలకు పైగా తక్కువ వడ్డీ రేటుతో చలామణిలోకి వచ్చింది. ఇళ్ళకూ... కార్లకూ... ఇతరాలకు".

"అది మన ఇన్‌స్టిట్యూషనల్ లెండింగ్ పాలసీ - అంటే సంస్థాగత రుణ సదుపాయ పాలసీకే వ్యతిరేకం కదా? మన గ్రామీణ రుణమంతా జాతీయ పెట్టుబడి..."

"కానీ, సవరణలు జరిగాయి కదా... సరళీకృతం అయ్యాయి కదా... అయినా ఇది ఇప్పటి మాటా? తొంభై ప్రారంభంలోనే అన్నీ ఆరంభమయ్యాయి. ఇప్పుడు అందరికీ కనబడుతోంది. అంతే!"

"ఉత్తుత్తిగా కనబడడం లేదు. దాని వికృతరూపం బడుగురైతుల మెడలో ఉరితాడవుతోంది!"

"ఇప్పుడు మన బోర్డు ప్రిన్సిపుల్స్ వేరు. ఉద్యోగులుగా మనం వాటిని పాటించాలి. అంతే! ఇలా చూడండి. ఈ క్రెడిట్ - డిపాజిట్ నిష్పత్తి. నగరాలలో ఎనభై శాతం! అదే గ్రామాలలో అయితే నలభై శాతం దాటుతుందేమో! కాలానుగుణంగా మనం మారాలి. మీ రిపోర్టు తయారు చేయండి. సోమవారం బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌తో మీటింగు

ఉంది. "ఆఫీసర్ ఓ క్షణం ఆగి కాస్తంత లోతుగా అన్నాడు, "అపూర్వా ... మీటింగ్‌కు కావల్సింది నీ స్టాటిస్టికల్ రిపోర్ట్ కానీ నీ వ్యక్తిగత అభిప్రాయం కాదు!"

'ప్చ్!' అపూర్వ నిట్టూర్చింది. 'బ్యాంక్ అకస్మాత్తుగా మూతబడితే లబ్దిదారులంతా ఏమవుతారు?'

లాభం లేదు.

కరువు! మన చుట్టూ. మన లోలోన.

ఇప్పుడు మన ఆలోచనల్లోనూ!

అంతటా!

లాభమే లేదు.

"లాభం ఎలా వస్తుందనుకొంటున్నావు రా?" అపూర్వ ఏ ఉపోద్ఘాతం లేకుండా అడిగింది.

"ఏముంది? పంట ధర నిర్ణయించేది ఇక మనమే కదా? ముడి సరుకు చౌకగా దొరికితే లాభాలు వాటంతట అవే వస్తాయి!" అమిత్ సులువుగా వ్యాపార రహస్యం విప్పేసాడు.

అమిత్ గొంతు లోకి ఆ తెలికతనం అపూర్వను విలవిలలాడించింది. పెదాలు వణుకుతుంటే నెమ్మదిగా ఒక్కో మాట అంది. "అమిత్, అలా అయితే నువ్వు అమ్మబోయేది టమాట రసం కాదురా... రైతుల రక్తం!"

"అక్కా.."

"రైతుల ప్రాణం మానం అభిమానం రోషం అన్నీ తూకం వేసేది గిట్టుబాటు ధర! అది నీ చేతుల్లోకి తీసుకొంటానంటావ్! వాళ్ళకి మార్కెట్ భద్రత కావాలా? మార్కెట్ భద్రయ్యలు కావాలా?"

అమిత్ అపూర్వ గొంతులోని తీవ్రతకు విస్తుబోయాడు.

అపూర్వ అక్కడే ఉన్న మరో కాగితాల కట్టను చూపిస్తూ అంది.

"అమిత్.. ఇవేమిటో తెలుసా? నీవు ఒక మూసిన ఫ్యాక్టరీని తెరవాలనుకుంటే నేను ఒక తెరిచివున్న బ్యాంక్‌ను మూసివేయడానికి తయారు చేసిన రిపోర్టు. రేపు ఉదయం దీనిపై నిర్ణయం తీసుకోబోతున్నారు"

అర్థం కానట్లుగా అయోమయంగా చూశాడు అమిత్.

"బయ్యరు భద్రం... నీకు గుర్తున్నాడా? మన ఊళ్ళో ఎరువుల కొట్టు అతనిదే. అందులోనే విత్తనాలు అమ్మేవాడు. అన్నింటికీ అప్పులు ఇచ్చేది అతనే. చివరికి పంట కొనేది అతనే. మన కళ్ళ ముందే ఒక్కో రైతు చితికిపోతుంటే... అతనేమో...అబ్బో... ఇంతింతై ఎదిగిపోలేదూ? అతను ఎంత చెపితే అంత. దస్తావేజులు, అతని చేతిలో ఉండే సరికి వడ్డీ రేటుకు అడ్డూ అదుపు లేదు. మాఫీలు, సబ్సిడీలు, వాయిదాలు లేవు. రాతలు కోతల్లో స్పష్టత లేదు. అతను ఆడిందే ఆట పాడిందే పాట.

అతను కాకపోతే మరొకడు. ఏ ఊరివారైనా అతని వంటి వారి గుప్పిట్లోనే.

ఆసరాలేకో అవసరానికో వారి దగ్గర అప్పులు చేయడం.

మర్యాదకో మన్ననకో రోషానికో పౌరుషానికో రైతులు తమలో తామే కుంగి పోయారే కానీ - ఏనాడైనా మాట తప్పారా? అందుకు వారెన్ని తిప్పలు పడ్డారో మనకు తెలియదూ? రానురాను ఆ ఊబిలోకి కూరుకుపోతుంటే - మనం మాత్రం - చూస్తూ ఊరుకోలేదా? పైనుంచి ఉచ్చు మరింతగా బిగించాం. అదే సంస్థాగత రుణాలైతే... ఎంతో కొంత మన చేతుల్లోనే ఉండేది కాదా?"

అపూర్వ గొంతు పూడుకు పోతోంది.

"ఒక్కో గ్రామీణ బ్యాంకు మూత పడుతోంటే ఆ బడుగు ప్రాణులు మాత్రం ఎక్కడికి పోతారు? వాళ్ళకెవరు అతీగతీ? నారు పోయాలన్నా... నీరు పారాలన్నా... బోరు వేయాలన్నా... బర్రెను కొనాలన్నా, కాడి సాగాలన్నా... మేడి పట్టాలన్నా... డబ్బే కదా కావాలి. ఎవరు వాళ్ళకు ఆదరువు? ఆ బయ్యరు భద్రయ్య వంటి వారే కదా? మరి వారు సమాజానికి చేస్తున్నది మేలా కీడా?

"అక్కా.."

"ఇలా చూడు. మా రిపోర్టు. ఎంత చక్కగా ఉందో. మా గ్రామీణ సంక్షేమ బ్యాంక్‌ను మూసి వేయడానికి గల మూడువందల యాభై కారణాలను ఎంత ముచ్చటగా వివరిస్తుందో... ఛ! ఇట్లా మూతబడే ప్రతి ఆర్థిక సంస్థ అనేకమంది భద్రయ్యలను పుట్టిస్తుందిరా... అవసరం అలాంటిది-"

"అన్నీ తెలిసి బ్యాంక్ మూసివేయడం దేనికి?"

"లాభం లేదు! అవునురా. లాభం లేదనే ఈ గతి పట్టిస్తున్నాం. ఏనాడైతే సరళీకృత ఆర్థిక విధానం ప్రారంభమయిందో ఆరోజే బ్యాంకుల సంక్షేమ సూత్రం క్షీణించడం మొదలైంది.

ఏ రోజున బ్యాంకులకు స్వయంగా వడ్డీ రేట్లను నిర్ధారించే స్వతంత్రం వచ్చిందో ఏనాడైతే బ్యాంకులకు కొత్త బ్రాంచీల నిర్ణయాలపై లావాదేవీలపై స్వేచ్ఛ వచ్చిందో - ఆనాడే బ్యాంకుల మ్యానేజ్‌మెంట్‌కు లాభాపేక్ష ప్రారంభమైంది.

బలహీన వర్గాలకు పేద రైతులకు ఉద్దేశించిన సంక్షేమ రుణ సదుపాయాలన్నీ జాతీయ పెట్టుబడిగానూ - వారి వ్యక్తిగత ఉత్పత్తిని జాతీయ ఉత్పత్తిగానూ పరిగణించడం మానేశారు.

అంతే.

పల్లెలపై ముఖం మొత్తింది.

పట్టణాలను నగరాలను అప్పులతో ముంచెత్తి, తిరిగి లాభాలు రాబట్టు కోవడంలో బ్యాంకు యజమానులు బయ్యరు భద్రయ్యల అవతారం ఎత్తారు!

వాళ్ళకి కావాల్సింది వారి సంస్థల లాభమే కానీ జాతీయ విపత్తు కాదు.

అటు నగర వ్యాపారాన్ని పేదల సంక్షేమం కోసం ఇటు గ్రామీణ సదుపాయాన్ని ఈనాటి బ్యాంకులు అవలంబిస్తే ఎంత బావుణ్ణు!"

అపూర్వ గొంతులోని దుఃఖం అమిత్‌ను తాకింది.

"అక్కా... నన్నేం చేయమంటావ్?" నెమ్మదిగా అడిగాడు.

"అమ్మా... నేను తొందరగా ఇంటికి పోవాలి. పోయెస్తా" రాజు వగరుస్తూ గుమ్మంలోంచే అరిచినంత పని చేశాడు.

అపూర్వ అమిత్‌కి సమాధానం చెప్పేలోగానే... రాజు హడావుడికి అతని వంక చూశారు. నువ్వే కాదురా తమ్ముడు... నేను చేయవలసిందీ ఎంతో వుంది" అపూర్వ మాట ఆమె గొంతులోనే ఇంకిపోయింది.

"అంత తొందర దేనికి రాజు?" అమిత్ అడిగాడు.

"అరే.. టివి పెట్టలేదా సార్.. బంద్. మార్కెట్ దగ్గర లాఠీచార్జీ అంట. ఒకరిద్దరి తలలు పగిలినయంటున్నారు."

"అమిత్ గబగబ వెళ్ళి టివి ఆన్ చేశాడు.

మార్కెట్ డ్రాయింగ్ రూంలోకి వచ్చేసింది.

మార్కెట్ వీధంతా చెల్లాచెదురుగా టమాటాలు, చిందరవందరగా పడిన ఖాళీ బుట్టలు. తలలు పగిలి రక్తసిక్తమైన నుదురులు.

ఆవేశాలు. అరుపులు, ఆవేదనలు. శోకతప్త హృదయాలు.

లాఠీల స్వైర విహారాలు. సామాన్యుల ఉరుకులు పరుగులు.

అపూర్వ, అమిత్ నిశ్చేష్టులై ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకున్నారు.

ఎవరో బలవంతంగా గింజుకుంటోన్న వ్యక్తిని విసురుగా వ్యాన్‌లోకి ఎక్కించారు.

"అరరే... పాండు!" అపూర్వ అప్రయత్నంగా అంది.

పాండు ముఖాన నిస్సహాయత తప్ప ఏమీ లేదు.

"ఉదయం, బయట పల్లెల వాళ్ళకు, లోపలి వ్యాపారులకు ఘర్షణ జరుగుతోంది. దాని మూలంగానేనా....?" అపూర్వ ఎవర్నీ ఉద్దేశించని ప్రశ్న అడిగింది. తనలో తనే మాట్లాడినట్లుగా.

"అదేం కాదమ్మా... బుట్టలోళ్ళు లోపలోళ్ళు ఒకటయ్యారు. కానీ గవర్నమెంటు డబ్బులేవో కట్టాల్నంట అందుకు!" రాజు సమాధానం ఇచ్చాడు.

ఉదయం కూరగాయల వ్యాపారుల మాటలు అపూర్వకు గుర్తుకు వచ్చాయి.

"కలెక్టర్ ఉత్తర్వులు"

అవును... వాళ్ళు అదే మాట్లాడుకుంటున్నారు. రాజకీయ నాయకుల అండ ఉన్నదన్న ధీమా ఏదీ? ఎటు పోయింది? ఉదయాన కళకళలాడిన మార్కెట్ ఇలా కకావికలయ్యిందే! ఏరీ వాళ్ళంతా? ఎటు పోయారు?

చివరకు ఇదా జరిగింది!

అపూర్వ నిట్టూర్చింది.

"అమ్మా... పక్కింటి పార్వతమ్మగారు ఏదో పెట్టె పంపారు..." పోశమ్మ హడావుడిగా లోపలికి వచ్చింది. అందరినీ లోకంలోకి తెస్తూ.

రాజు గబగబ పెట్టె విప్పాడు. అమిత్ సైగతో.

టమాటాలు!

ఎర్రగా.

నిగనిగలాడుతూ.

"అగ్గువకు చిక్కినాయి కదా అనీ..." పోశమ్మ ఓ దీర్ఘం తీసింది, 'ఎటూ జూసినా టమాటాలు....!" మెటికలు విరిచింది.

అపూర్వ ఉలిక్కిపడింది.

"అగ్గువా? ఏది అగ్గువ?

అస్తవ్యస్తమైన మార్కెట్టా?

మూసివేసిన ఫ్యాక్టరీనా?

మూయబోతున్న బ్యాంకా?

ఏది అగ్గువ?

ఆగిపోయిన పెదనాన్న ఊపిరా?

రక్తసిక్తమైన పాండు నుదురా?

చితికిన బుట్టలోళ్ళ బతుకా?

ఏది అగ్గువ?

అపూర్వ గొంతు పూడుకుపోతుంటే భారంగా అంది.

"ఏదీ అగ్గువ కాదు... పోశవ్వా... ఏదీ అగ్గువ కాదు!".

▲